# 53. అన్ నజ్మ్ (నక్షత్రం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 62 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి బోధించింది. ఈ సూరా మొదటి ఆయతులో నక్షత్రం గురించిన ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఆధారంగా ఈ సూరాకు ఈ పేరు పెట్టడం జరిగింది. దైవవాణి అవతరణను, ప్రవక్తల పరంపరను అవిశ్వాసులు నిరాకరించేవారు. కాని అవి వాస్తవాలని ఈ సూరా ధృవీకరించింది. దివ్యఖుర్ఆన్‌ను అల్లాహ్ అవతరింపచేసాడనీ, దైవవాణి అవతరణ భ్రమ కాదని, ఒక వాస్తవమనీ, దైవదూత జిబ్రయీల్ (అస) ద్వారా దైవ వాణిని పంపడం జరిగిందనీ ఇందులో గట్టిగా చెప్పడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రత్యక్షంగా దైవదూత జిబ్రయీల్(అస)ను రెండుసార్లు చూసారని ఈ సూరా వల్ల తెలుస్తోంది. దైవదూత ప్రథమంగా దైవవాణిని తీసుకొచ్చినపుడు మొదటిసారి, మేరాజ్ (గగనయాత్ర) సందర్భంగా రెండవసారి ఆయన జిబ్రయీల్(అస)ను చూసారు.

అల్లాహ్‌కే ప్రత్యేకమైన సృష్టిసామర్థ్యాన్ని విశదీకరించడం ద్వారా దేవుని ఏకత్వాన్ని ఈ సూరాలో నిదర్శనాలతో సహా రుజువుచేయడం జరిగింది. ఆయన మనిషిని మట్టి నుంచి సృష్టించాడు. మాతృగర్భంలో పిండరూపంలో ఉన్నవారి గురించి కూడా ఆయనకు అన్నీ తెలుసు. ఆయన జీవితాన్ని ఇస్తాడు, చావును ఇస్తాడు. మనకు ఆనందాన్ని, దుఃఖాన్ని ఇచ్చేది ఆయనే. ఆయన ఒక్క వీర్యం బిందువు నుంచి స్త్రీపురుషులను సృష్టించాడు. మరణించిన తర్వాత మళ్ళీ లేపడం ద్వారా ఆయన మళ్ళీ రెండవసారి పుట్టిస్తాడు. ఆయనే విశ్వానికి సృష్టికర్త, విశ్వపోషకుడు. ఆయనే సంపదలను, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తాడని బోధించింది. ప్రవక్త ముహమ్మద్(సఅసం)ను ఉద్దేశించి ఇస్లాం సందేశాన్ని కాదంటున్న వారిని పట్టించు కోవద్దని, వారు కేవలం ప్రాపంచిక జీవితం పట్ల మాత్రమే ఆసక్తి కలిగి ఉన్నారని బోధించడ మైనది.

## 53. అన్ నజ్మ్[1] సూరా

سُوْرَةُ النَّجْمِ

అవతరణ :మక్కాలో ఆయతులు : 62

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 క్రింద పడేటప్పటి నక్షత్రం సాక్షిగా![2]

وَالنَّجْمِ اِذَا هَوٰىۙ ①

2 మీ సహచరుడు (అయిన ముహమ్మద్–స) దారి తప్పనూ లేదు, పెడదారి పట్టనూ లేదు.[3]

مَا ضَلَّ صَاحِبُكُمْ وَمَا غَوٰىۚ ②

1. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా అవిశ్వాసుల సమక్షంలో బహిరంగంగా పారాయణం చేసిన తొలి సూరా ఇది. దీని పఠనం తరువాత మహాప్రవక్త (సఅసం), ఆయన వెనుక ఉన్న వారంతా సాష్టాంగ ప్రణామం చేశారు – ఒక్క ఉమయ్య బిన్ ఖలఫ్ తప్ప! అతడు మాత్రం గుప్పెడు మట్టి తీసుకుని, దానిపై సాష్టాంగ ప్రణామం చేశాడు. అందుచేత అతడు అవిశ్వాస స్థితిలోనే మరణించాడు (సహీహ్ బుఖారీ – నజ్మ్ సూరా వ్యాఖ్యానం).

మరికొన్ని ఆధారాల ప్రకారం ఆ వ్యక్తి ఉత్బా బిన్ రబీయ అని తెలుస్తోంది (తఫ్సీర్ ఇబ్నె కసీర్). నిజము దేవుడెరుగు. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) ఇలా అంటున్నారు: "నేను ఈ సూరాను ఆయన (సఅసం) సమక్షంలో పారాయణం చేశాను. ఆయన మాత్రం సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేయలేదు" (సహీహ్ బుఖారీ). దీన్నిబట్టి తెలిసేదేమిటంటే సజ్దా చేయటం వాంఛనీయమే గాని తప్పనిసరి కాదు. ఎప్పుడయినా ఈ సజ్దా చేయకపోయినా ఫరవాలేదు.

2. ఈ **'నక్షత్రం'** పేరుపై వ్యాఖ్యాతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. కొంతమంది దీన్ని **'సురయ్యా'** అని పేర్కొనగా, మరికొంతమంది 'జుహ్‌రా'గా పేర్కొన్నారు. నక్షత్రాలన్నిటికీ ఈ పదం వర్తిస్తుందని ఇంకొంతమంది వ్యాఖ్యానించారు. **'హవా'** (هَوٰى) అంటే పైనుంచి క్రిందికి పడటం అని అసలు అర్థం. అనువాదకులు కొందరు దీన్ని అస్తమించటం అన్న భావంలో తీసుకున్నారు. రాత్రి చివరిభాగంలో – ఫజ్ర్ నమాజ్ వేళ – అది పడ్తుంది. లేదా షైతానులను తరిమి కొట్టేందుకు పడ్తుంది. లేదా కొంతమంది అభిప్రాయపడినట్లు ప్రళయదినాన నక్షత్రాలు క్రిందపడతాయి.

3. **'మీ సహచరుడు'** ( صَاحِبُكُمْ ) అంటే ముహమ్మద్ ప్రవక్త (సఅసం) అన్నమాట! అతడు సత్య సంధుడు. దైవప్రవక్తగా నియమించబడక ముందు – నలభై సంవత్సరాల

| | |
|---|---|
| 3 అతను తన మనోభిరామం ప్రకారం మాట్లాడటమూ లేదు. | وَمَا يَنْطِقُ عَنِ الْهَوٰى ۞ |
| 4 అది (అతను మాట్లాడేదంతా) అతని వద్దకు పంపబడే దైవవాణి (వహీ) తప్ప మరేమీ కాదు.[4] | اِنْ هُوَ اِلَّا وَحْيٌ يُّوْحٰى ۞ |
| 5 అసాధారణ శక్తిగల దైవదూత (జిబ్రయీల్) అతనికి (ఖుర్ఆన్) నేర్పాడు. | عَلَّمَهٗ شَدِيْدُ الْقُوٰى ۞ |
| 6 అతడు గొప్ప శక్తిసంపన్నుడు.[5] మరి అతను తిన్నగా నిలబడ్డాడు – | ذُوْ مِرَّةٍ ؕ فَاسْتَوٰى ۞ |

పాటు – ఆయన మీ మధ్యన ఉన్నాడు. అతని రేయింబవళ్ళ రికార్డు అంతా మీ ముందు ఉన్నది. అతని గుణగణాల గురించి మీకు క్షుణ్ణంగా తెలుసు. అతనిలో మీరు సత్యసంధతను, నిజాయితీ తత్పరతను తప్ప మరో దుర్గుణాన్ని ఎరుగరు. ఇప్పుడు నలభై ఏండ్ల తరువాత అతను దైవప్రవక్తనని ప్రకటించుకుంటే, అతను అబద్ధం చెబుతున్నాడని ఎలా అంటారు? మీరే ఆలోచించండి! వాస్తవానికి అతను మార్గవిహీనుడూ కాదు, అతను దారి మరవనూ లేదు. కాకపోతే అపమార్గం పట్ల, అజ్ఞానం పట్ల అతడు తన విసుగును, వైముఖ్యాన్ని ప్రకటిస్తున్నాడు. ఉద్దేశ్య పూర్వకంగా అతడు సత్యాన్ని పరిత్యజించి ఉంటే పెడదారి పట్టాడని అనుకోవచ్చు. కాని మీ సహచరుడు అలాంటిదేదీ చేయలేదు. అయినా మీరు అతనిపట్ల లేనిపోని అనుమానాలకు ఎందుకు పోతున్నారు?

4. అతడు ఏది మాట్లాడినా దైవవాణి ప్రకారమే మాట్లాడతాడు. ఏ పనిచేసినా దైవాదేశానుసారమే చేస్తాడు. అతడు నవ్వే, నవ్వించే సమయంలో కూడా – మాట వరుసకు కూడా – సత్యవిరుద్ధమైన విషయమేదీ చెప్పడు. మరలాంటప్పుడు అతను మార్గభ్రష్టుడుగానీ, దారితప్పిన వాడుగానీ ఎలా అవుతాడు? (సుననె తిర్మిజీ – అబ్వాబుల్ బిర్ర్). అలాగే కోపావేశంలో సయితం ఆయన (స) ఎన్నడూ అదుపు తప్పలేదు. కోపంలో ఎన్నడూ ఆయన నోట వాస్తవ విరుద్ధమైన విషయం వెలువడలేదు (అబూదావూద్ – కితాబుల్ ఇల్మ్).

5. దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) గురించి ఇక్కడ చెప్పబడుతోంది. అతను దృఢకాయుడు. బలశాలి. దేవుని వద్ద నుంచి సందేశాన్ని (వహీని) తీసుకువచ్చే, దైవప్రవక్త (స)కు వినిపించే బాధ్యత ఈ దైవదూతపై ఉంది.

**7** అతడు ఎత్తయిన ఆకాశపుటంచులపై ఉన్నాడు.[6]

وَهُوَ بِالْأُفُقِ الْأَعْلَىٰ ⑦

**8** మరి అతను సమీపించసాగాడు... అలా అలా వాలుతూ వచ్చాడు.[7]

ثُمَّ دَنَا فَتَدَلَّىٰ ⑧

**9** చివరికి అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంతకన్నా తక్కువ దూరాన ఉండిపోయాడు.[8]

فَكَانَ قَابَ قَوْسَيْنِ أَوْ أَدْنَىٰ ⑨

**10** తరువాత అతడు దైవదాసునికి అంద జేయవలసిన సందేశాన్ని అందజేశాడు.[9]

فَأَوْحَىٰ إِلَىٰ عَبْدِهِ مَا أَوْحَىٰ ⑩

**11** (ప్రవక్త) తిలకించినది అసత్యమని అతని హృదయం చెప్పలేదు.[10]

مَا كَذَبَ الْفُؤَادُ مَا رَأَىٰ ⑪

**12** ఏమిటీ (ప్రవక్త) చూస్తున్న దానిపై మీరు అతనితో వాదులాడుతున్నారా?

أَفَتُمَارُونَهُ عَلَىٰ مَا يَرَىٰ ⑫

**13** అతను (ముహమ్మద్ – స) అతన్ని (జిబ్రయీల్‌ను) మరో సందర్భంలో కూడా చూసి ఉన్నాడు –

وَلَقَدْ رَآهُ نَزْلَةً أُخْرَىٰ ⑬

6. వహీని ప్రవక్తకు నేర్పిన పిదప ఆ దైవదూత ఆకాశపుటంచుపై వెళ్ళి నిలబడ్డాడు.

7. తరువాత దివి నుండి భువికి దిగివచ్చాడు. క్రమక్రమంగా దైవప్రవక్త (సఅసం)ను సమీపించాడు.

8. కొంతమంది "రెండు చేతులంత దూరాన" అని అనువదించారు. దైవప్రవక్త (స)కు – దైవదూత జిబ్రయీల్‌కు మధ్య గల సామీప్యాన్ని ఇది సూచిస్తోంది. అంతేగాని కొంతమంది భావిస్తున్నట్లు ఇది ముహమ్మద్ ప్రవక్తకు – దేవునికి మధ్య ఏర్పడిన సామీప్యం కాదు. సందర్భం దృష్ట్యా కూడా ఇవి ముహమ్మద్ (స)కు – జిబ్రయీల్‌కు సంబంధించి చెప్పిన విషయాలేనన్నది గమనార్హం. ఈ సందర్భంగానే దైవప్రవక్త (స) ఆయన్ని నిజరూపంలో చూశారు. అది మహాప్రవక్త (స)కు దైవదౌత్యం లభించిన ఆరంభకాలం. తరువాత రెండవసారి మేరాజ్ యాత్ర సందర్భంగా ఆయన ఈ దైవదూతను నిజరూపంలో చూశారు.

9. అంటే జిబ్రయీల్ (అలైహిస్సలాం) మహాప్రవక్త ముహమ్మద్ (స)కు దైవవాణిని వినిపించారు.

10. ఆయన (అలైహిస్సలాం)కు 600 రెక్కలున్నాయని, ఒక్కో రెక్క తూర్పు – పడమరలంత

14 ‘సిద్రతుల్ మున్తహా’ దగ్గర![11]

عِنْدَ سِدْرَةِ الْمُنْتَهٰى ﴿١٤﴾

15 అక్కడే ‘జన్నతుల్ మావా’[12] కూడా ఉంది.

عِنْدَهَا جَنَّةُ الْمَأْوٰى ﴿١٥﴾

16 అప్పుడు ఆ ‘సిద్రా’ను ఆవరించే వస్తువేదో ఆవరిస్తూ ఉన్నది.[13]

إِذْ يَغْشَى السِّدْرَةَ مَا يَغْشٰى ﴿١٦﴾

17 (అతని) చూపు తప్పిపోనూ లేదు, హద్దు దాటిపోనూ లేదు.[14]

مَا زَاغَ الْبَصَرُ وَمَا طَغٰى ﴿١٧﴾

18 నిస్సందేహంగా అతను తన ప్రభువు యొక్క గొప్ప సూచనలు (కొన్నింటిని) తిలకించాడు.[15]

لَقَدْ رَاٰى مِنْ اٰيٰتِ رَبِّهِ الْكُبْرٰى ﴿١٨﴾

---

పొదవుగా ఉందని, మహాప్రవక్త (స) తన కళ్లతో చూసిన దాన్ని ఆయన హృదయం తిరస్కరించలేదని, పైగా దేవుని ఈ శక్తిని ఒప్పుకుందని అనబడింది.

11. మేరాజ్ (గగన యాత్ర) సందర్భంగా అన్నమాట. ఆ సమయంలో కూడా దైవప్రవక్త (సల్లం) దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను నిజస్థితిలో చూశారు. **‘సిద్రతుల్ మున్తహా’** అనేది ఒక రేగు వృక్షం. అది ఆరవ లేక ఏడవ ఆకాశంలో ఉంది. అది చివరి హద్దు. ఆ హద్దును దాటి ఏ దైవదూత కూడా ముందుకు పోలేదు. దైవాజ్ఞలను కూడా దైవదూతలు ఇక్కడి నుండే పొందుతారు.

12. దాన్ని **‘జన్నతుల్ మావా’** (స్వర్గధామం) అనటానికి ఒక కారణమేమిటంటే హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) నివాస స్థలం అక్కడే ఉండేది. ఆత్మలు ఈ ప్రదేశానికి వచ్చి చేర్తాయని కొందరు అభిప్రాయపడ్డారు (ఫత్హుల్ ఖదీర్).

13. మహాప్రవక్త (సఅసం) మేరాజ్ సందర్భంగా ఆ వృక్షాన్ని చూచినప్పటి అనిర్వచనీయమైన స్థితి ఇక్కడ చెప్పబడింది. ఆ వృక్షం చుట్టూ బంగారు దూదిపురుగులు ఎగురుతున్నాయి. దైవదూతల ప్రతిబింబం దానిపై అవలీలగా పడుతూ ఉంది. పరమ ప్రభువు తేజస్సు కూడా అక్కడ తొణకిసలాడుతూ ఉంది (ఇబ్నె కసీర్). ఆ ప్రదేశం దగ్గరే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారికి మూడు కానుకలు వొసంగబడ్డాయి: 1. ఐదుపూటల నమాజులు 2. అల్ బఖరా సూరా చివరి ఆయతులు 3. షిర్క్ కాలుష్యానికి దూరంగా ఉండే ముస్లింకు క్షమాభిక్ష ప్రసాదించబడుతుందన్న వాగ్దానం. (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఈమాన్).

14. అంటే – ఆ మధుర క్షణాలలో మహాప్రవక్త (సఅసం) వారి దృష్టి కుడి ఎడమల

| | |
|---|---|
| **19** ఏమిటీ, మీరు లాతు, ఉజ్జాలను చూశారా? | أَفَرَءَيْتُمُ ٱللَّٰتَ وَٱلْعُزَّىٰ ﴿١٩﴾ |
| **20** మూడవది, చివరిది అయిన మనాతును[16] (కూడా చూశారా?) | وَمَنَوٰةَ ٱلثَّالِثَةَ ٱلْأُخْرَىٰ ﴿٢٠﴾ |

వైపుమళ్లటం గానీ, అవధులు మీరిపోవటంగానీ జరగలేదు. ఆ దృశ్యాన్ని ఆయన తదేకంగా తిలకించారు (ఐసరుత్తఫాసీర్).

15. జిబ్రయీల్‌ను నిజరూపంలో చూడటం, సిద్రతుల్ ముస్తహాను తిలకించటం కూడా ఆ గొప్ప సూచనలలో భాగమే. మిగిలిన సూచనలు మేరాజ్ యాత్రకు సంబంధించిన హదీసులలో వివరించబడ్డాయి.

16. బహుదైవారాధకులకు హెచ్చరికగా ఈ మాటలనబడ్డాయి. అల్లాహ్ జిబ్రయీల్ (అలైహిస్సలాం) లాంటి గొప్ప దూతలను సృష్టించాడు. ముహమ్మద్ (సఅసం)లాంటి ఉత్తములను తన ప్రవక్తగా నియమించుకున్నాడు. ఆ ప్రవక్తను సప్తాకాశాలలోకి పిలుచుకుని ఆయనకు అద్భుత సూచనలను చూపించాడు. ఆయన ద్వారా ముస్లిం సమాజానికి అమూల్య కానుకల్ని కూడా ఇచ్చి పంపాడు. మరైతే మీరు కొలిచే దేవీ దేవతలలో ఈ సుగుణాలు ఉన్నాయా? ఈ సందర్భంగా అరబ్బు ద్వీపంలో ఖ్యాతి గడించిన మూడు దేవతల పేర్లు ప్రస్తావించబడ్డాయి.

మొదటిది **'లాత్'**. అసలు ఈ పదం 'అల్లాహ్' అనే పదం నుంచి ఏర్పడినదేనని కొంతమంది అభిప్రాయపడ్డారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం 'లాత్' అంటే త్రిప్పటం, మళ్ళించటం అని అర్థం. అరబ్బు పూజారులు తమ మెడలను ఆ దేవత వైపుకు త్రిప్పేవారు. దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. అందుచేత దానికా పేరు పడింది. మరి కొంతమంది ప్రకారం ఈ పదం 'లత్త' నుంచి ఏర్పడింది. లత్త అంటే పిండి నానబెట్టటం అని అర్థం. పూర్వం మక్కాలో 'లాత్' అనే పుణ్యపురుషుడుండేవాడు. అతడు పిండిని నానబెట్టి హజ్ యాత్రికులకు (పాయసం లాంటి పదార్థాన్ని) త్రాగించేవాడు. అతను చనిపోయిన తరువాత జనులు అతని జ్ఞాపకార్థం ఒక గుమ్మటం నిర్మించారు. కొంతకాలం గడిచాక అక్కడ అతని విగ్రహాలు ప్రతిష్ఠించబడ్డాయి. అతను తాయఫ్‌లో సఖీఫ్ తెగవారి అతి పెద్ద దేవతగా వర్థిల్లసాగాడు.

**'ఉజ్జా'** అనేది అల్లాహ్ గుణవాచకమైన 'అజీజ్' నుండి పుట్టుకు వచ్చిందని కొంతమంది చెబుతారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం 'గిత్ఫాన్' ప్రాంతంలో 'ఉజ్జా' అనే ఒక వృక్షం ఉండేది. జనులు దాన్ని పూజించేవారు. ఇంకొక కథనం ప్రకారం ఇదొక దెయ్యం. అడపాదడపా అది కొన్ని చెట్లపై ప్రత్యక్షమయ్యేది. వేరొక కథనం ప్రకారం నిజానికి అదొక తెల్ల రాయి. ప్రజలు దాన్ని మొక్కుకునే వారు. ముఖ్యంగా ఖురైషు, కినానా తెగవారు దీన్ని కొలిచేవారు.

**'మనాత్'** అంటే 'ప్రవహింపజెయ్యటం' అని అర్థం. ఈ దేవత మెప్పు పొందటం

21 ఏమిటేమిటి!? మీ కోసమేమో మగపిల్లలూను, ఆయన కోసమేమో ఆడపిల్లలా?[17]

أَلَكُمُ الذَّكَرُ وَلَهُ الْأُنثَىٰ ﴿٢١﴾

22 ఈ విభజన మరీ ఘోరమైనది (కదూ!).[18]

تِلْكَ إِذًا قِسْمَةٌ ضِيزَىٰ ﴿٢٢﴾

కోసం జనులు దాని ముందు జంతు బలి ఇచ్చి రక్తం ప్రవహింపజేసేవారు. ఈ విగ్రహం మక్కా – మదీనా ప్రాంతాల మధ్య ఉండేది (ఫత్‌హుల్ ఖదీర్). 'ఖుదైద్'కు ఎదురుగా 'ముషల్లల్' అనే చోట ఇది ఉండేది. బనూ ఖుజాఆ తెగవారి ప్రత్యేక దేవత ఇది. అజ్ఞాన కాలంలో ఔస్, ఖజ్రజ్ తెగలవారు హజ్ యాత్రకు వెళ్ళినప్పుడు ఈ స్థలం (విగ్రహం) వద్దనే 'ఇహ్రామ్' (దీక్ష) బూనేవారు. ఆ విగ్రహం చుట్టూ వారు ప్రదక్షిణ కూడా చేసేవారు. (ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్).

ఇవిగాక ఆ పరిసర ప్రాంతాల్లో మరికొన్ని చిట్టిపొట్టి దేవుళ్ళ బొమ్మలు, దేవాలయాలు కూడా ఉండేవి. మక్కా విజయం తరువాత మహాప్రవక్త (సఅసం) ఈ విగ్రహాలను, విగ్రహారాధనాలయాలను నిర్మూలించారు. విగ్రహాలపై వెలసిన గుమ్మటాలను, పక్కా నిర్మాణాలను కూడా నేలమట్టం చేశారు. పూజా పునస్కారాలకు కేంద్రాలుగా మారిన చెట్లను కూడా నరికించివేశారు. విగ్రహారాధనకు ప్రతిరూపాలుగా ఉన్న ఇతరత్రా చిహ్నాలను కూడా రూపుమాపారు. ఈ పనికోసం ఆయన (సఅసం) హజ్రత్ ఖాలిద్, హజ్రత్ అలీ, హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్, హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా బజలీ (రిజ్వానుల్లాహి అలైహిమ్ అజ్మయీన్) తదితరులను నియమించారు. వారు అరేబియా భూభాగంలో ఉన్న ఈ విగ్రహ కేంద్రాలన్నింటినీ తొలగించి షిర్క్ (బహుదైవోపాసన)ను నిర్మూలించారు (ఇబ్నె కసీర్).

ఈ ప్రక్షాళన జరిగిన చాలా కాలం తరువాత అరేబియాలో మళ్లీ క్రమక్రమంగా విగ్రహారాధన మొదలయింది. దేశమంతటా పక్కా సమాధులు, గుమ్మటాలు, చిన్న చిన్న విగ్రహాలు వెలవటం మొదలయ్యాయి. సరిగ్గా ఆ సమయంలోనే షేఖ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ అనే సంస్కర్తను అల్లాహ్ ప్రభవింపజేశాడు. ఆయన 'దర్ఇయా' పరిపాలకుని సహాయసహకారాలతో ఈ షిర్క్ ఆనవాళ్ళన్నింటినీ రూపుమాపారు. ఈ బృహత్తర కార్యం ఇంకొకసారి – హిజాజ్ గవర్నర్ అయిన సుల్తాన్ అబ్దుల్ అజీజ్ (ప్రస్తుత సవూదీ పరిపాలకుల మూలపురుషుడు) కాలంలో కూడా రాజ్యమంతటా కొనసాగింది. ఆయన ఆ రాజ్యంలోని పక్కా సమాధులను, గుమ్మటాలను నేలమట్టంచేసి మహాప్రవక్త (సఅసం) సంప్రదాయాన్ని (సున్నత్‌ను) పునరుజ్జీవింప

إِنْ هِيَ إِلَّا أَسْمَاءٌ سَمَّيْتُمُوهَا أَنْتُمْ وَآبَاؤُكُمْ مَا أَنْزَلَ اللَّهُ بِهَا مِنْ سُلْطَانٍ إِنْ يَتَّبِعُونَ إِلَّا الظَّنَّ وَمَا تَهْوَى الْأَنْفُسُ وَلَقَدْ جَاءَهُمْ مِنْ رَبِّهِمُ الْهُدَى ﴿٢٣﴾

**23** నిజానికి ఇవన్నీ మీరూ, మీ తాత ముత్తాతలు వాటికి పెట్టుకున్న పేర్లు మాత్రమే. వీటిని గురించి అల్లాహ్ ఏ ప్రమాణమూ పంపలేదు. వీళ్లు కేవలం అంచనాలను, తమ మనోవాంఛలను అనుసరిస్తున్నారు. మరి చూడబోతే వారి ప్రభువు తరఫున వారి వద్దకు ఖచ్చితంగా మార్గ దర్శకత్వం వచ్చి ఉన్నది.

أَمْ لِلْإِنْسَانِ مَا تَمَنَّى ﴿٢٤﴾

**24** ఏమిటీ, మనిషి కోరుకున్నదల్లా అతనికి ప్రాప్తిస్తుందా?[19]

فَلِلَّهِ الْآخِرَةُ وَالْأُولَى ﴿٢٥﴾

**25** ఇహలోకమూ, పరలోకమూ అల్లాహ్ అధీనంలో మాత్రమే ఉన్నాయి.[20]

وَكَمْ مِنْ مَلَكٍ فِي السَّمَاوَاتِ لَا تُغْنِي شَفَاعَتُهُمْ شَيْئًا إِلَّا مِنْ بَعْدِ أَنْ يَأْذَنَ اللَّهُ لِمَنْ يَشَاءُ وَيَرْضَى ﴿٢٦﴾

**26** ఆకాశాలలో ఎంతో మంది దైవ దూతలు ఉన్నారు. కాని వాళ్ళ సిఫారసు ఏ మాత్రం పనికిరాదు. కాకపోతే అల్లాహ్ తన ఇష్టంతో, తాను కోరిన వారి విషయంలో (సిఫారసు వినడానికి) సమ్మతిస్తే అది వేరే విషయం.[21]

---

జేశారు. దైవకృపవల్ల, మహనీయుల నిర్విరామ కృషివల్ల నేడు యావత్తు సవూదీ అరేబియాలో ఎక్కడా పక్కా గోరీలుగానీ, గుమ్మటాలు గానీ లేవు.

17. మక్కా ముష్రిక్కులు దైవదూతలను అల్లాహ్ కుమార్తెలుగా భావించేవారు. ఈ ఆయతులో ఆ మూఢ విశ్వాసాన్ని ఖండించటం జరిగింది. దివ్య ఖుర్ఆన్‌లో పలుచోట్ల ఈ అంశం పునరావృతమయింది.

18. **'జీజా'** ( ضِيزَى ) అంటే అన్యాయపూరితమైనది అని అర్థం.

19. అంటే వారు కోరినదల్లా వారి దేవీదేవతలు వారికి ఇస్తున్నాయా? వారి సిఫారసులను ఆమోదిస్తున్నాయా? ఇది అసంభవం కదా!

20. అంటే – ఆయన కోరినది మాత్రమే నెరవేరుతుంది. ఎందుకంటే సర్వాధికారాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి.

21. అంటే – అల్లాహ్‌కు అత్యంత సన్నిహితులైన దైవదూతలకు సయితం సిఫారసుచేసే

**27** పరలోకాన్ని విశ్వసించనివారు దైవ దూతలకు ఆడవారి పేర్లు పెడతారు.

إِنَّ الَّذِينَ لَا يُؤْمِنُونَ بِالْآخِرَةِ لَيُسَمُّونَ الْمَلَائِكَةَ تَسْمِيَةَ الْأُنثَىٰ ﴿٢٧﴾

**28** వాస్తవానికి వారికి ఈ విషయంలో ఎలాంటి పరిజ్ఞానమూ లేదు. వారు ఉత్త అనుమానాలను అనుసరిస్తున్నారు. నిజానికి (మూఢ) అనుమానాలు సత్యం ముందు దేనికీ పనికిరావు.

وَمَا لَهُم بِهِ مِنْ عِلْمٍ ۖ إِن يَتَّبِعُونَ إِلَّا الظَّنَّ ۖ وَإِنَّ الظَّنَّ لَا يُغْنِي مِنَ الْحَقِّ شَيْئًا ﴿٢٨﴾

**29** కనుక (ఓ ప్రవక్తా!) మా ధ్యానం నుండి తిరిగిపోయి, కేవలం ప్రాపంచిక జీవితాన్ని మాత్రమే ఆశించేవాణ్ణి నువ్వు పట్టించుకోకు.

فَأَعْرِضْ عَن مَّن تَوَلَّىٰ عَن ذِكْرِنَا وَلَمْ يُرِدْ إِلَّا الْحَيَاةَ الدُّنْيَا ﴿٢٩﴾

**30** వారికి తెలిసింది అంతవరకే. తన మార్గం నుండి తప్పిపోయిన వాడెవడో నీ ప్రభువుకు బాగా తెలుసు. సన్మార్గం పొందినవాని గురించి కూడా ఆయనకు బాగా తెలుసు.

ذَٰلِكَ مَبْلَغُهُم مِّنَ الْعِلْمِ ۚ إِنَّ رَبَّكَ هُوَ أَعْلَمُ بِمَن ضَلَّ عَن سَبِيلِهِ وَهُوَ أَعْلَمُ بِمَنِ اهْتَدَىٰ ﴿٣٠﴾

**31** భూమ్యాకాశాలలో ఉన్నదంతా అల్లాహ్‌దే. దుష్కర్మలు చేసేవారికి అల్లాహ్ వారి కర్మలకు తగ్గ ప్రతిఫలం ఇవ్వటానికి, సత్కర్మలు చేసేవారికి వారి కర్మలకు తగ్గట్టుగా పుణ్యఫలం ప్రసాదించ టానికి (సన్మార్గ దుర్మార్గాలు ఆయన చేతుల్లోనే ఉన్నాయి).[22]

وَلِلَّهِ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ لِيَجْزِيَ الَّذِينَ أَسَاءُوا بِمَا عَمِلُوا وَيَجْزِيَ الَّذِينَ أَحْسَنُوا بِالْحُسْنَى ﴿٣١﴾

అధికారం లేదు. వారు ఒకవేళ సిఫారసు చేసినా అల్లాహ్ కోరిన వారి విషయంలో మాత్రమే ఏదన్నా సిఫారసు చేయగలుగుతారు. మరి యదార్థం ఇదైనపుడు రాతి విగ్రహాలు ఎలా పనికివస్తాయి? వాటిపై కోటి ఆశలు పెట్టుకోవటం ఎంతవరకు సహేతుకం. అదలా వుంచితే ముష్రిక్కుల కోసం సిఫారసు చేసే అనుమతిని అల్లాహ్ ఎక్కడిస్తాడని? ఆయన సన్నిధిలో అత్యంత ఘోర విషయం షిర్కే కదా!

22. అంటే–సన్మార్గమైనా, అపమార్గమైనా ఆయన చేతుల్లోనే ఉంది. ఆయన తాను కోరిన వారికి సన్మార్గం వొసగుతాడు. తాను కోరిన వారిని అపమార్గాన వదిలేస్తాడు.

32 ఎవరయితే పెద్ద పాపాలకు దూరంగా ఉంటారో, చిన్న చిన్న తప్పులు మినహా[23] నీతిబాహ్యతను కూడా విడనాడతారో[24] (వారి పాలిట) నిశ్చయంగా నీ ప్రభువు

اَلَّذِيْنَ يَجْتَنِبُوْنَ كَبٰٓئِرَ الْاِثْمِ وَالْفَوَاحِشَ اِلَّا اللَّمَمَ ؕ اِنَّ رَبَّكَ وَاسِعُ الْمَغْفِرَةِ ؕ هُوَ اَعْلَمُ بِكُمْ اِذْ اَنْشَاَكُمْ مِّنَ الْاَرْضِ وَاِذْ اَنْتُمْ اَجِنَّةٌ

సన్మార్గగాములకు వారి సత్కర్మల ప్రతిఫలం ఇవ్వటానికి, దుర్మార్గులకు వారి దురాగతాలకు తగ్గ ప్రతిఫలం ఇవ్వటానికి ఆయన ఈ 'వ్యవస్థ'ను ఏర్పరచాడు. (ఫత్‌హుల్ ఖదీర్).

23. **'ల్లమమ్'** అంటే తక్కువ, అల్పం, చిన్నపాటి అని అర్థం. ఏదైనా ఒక పనిని ఒకసారి చేసి వదిలెయ్యటం, మాటిమాటికీ దాని జోలికి పోకుండా ఉండటం, మనసులో మాత్రమే తలపోయటం – ఇవన్నీ 'ల్లమమ్' అనబడతాయి. (ఫత్‌హుల్ ఖదీర్). ఈ క్రమంలో 'లమమ్' అన్న పదం 'చిన్న చిన్న పాపాలు' అన్న అర్థంలో ఉపయోగించ బడింది. దీని మతలబు ఏమిటంటే పెద్ద పెద్ద పాపాలు చేయాలన్న ఆలోచన మనసులో వచ్చినప్పటికీ దాన్ని ఆలోచనల వరకే పరిమితం చేయటం, క్రియాత్మకంగా పెద్ద పాపాలకు ఒడిగట్టకుండా ఉండటం, ఏదైనా ఒక పాపకార్యం ఒకటి రెండుసార్లు జరిగిపోయాక ఇక శాశ్వతంగా దానికి స్వస్తి పలకటం లాంటివి చిన్న చిన్న పొరపాట్లుగా పరిగణించబడతాయి. మనిషి పెద్ద పాపాల జోలికిపోకుండా ఉన్నట్లయితే వాటి పుణ్యమా అని దేవుడు చిన్న చిన్న పొరపాట్లను కూడా మన్నిస్తాడు.

24. ఇంతకీ **'పెద్దపాపాలు'** ఏవి? ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఏ పాపాలకు ఒడిగట్టడం వల్ల నరకయాతన తథ్యమని హెచ్చరించబడిందో, మరే పనులను ఖుర్‌ఆన్ హదీసులు తీవ్రంగా ఖండిస్తున్నాయో అవన్నీ పెద్ద పాపాల జాబితాలోనికి వస్తాయని చాలా మంది పండితులు భావిస్తున్నారు. చిన్న చిన్న పాపాలపై మనిషి సిగ్గుపడకుండా వాటిని యధేచ్ఛగా చేస్తూపోతే అవి పెద్ద పాపాలుగా పరిణమిస్తాయని కూడా విద్వాంసులు చెప్పారు. అలాంటి పాపాలను కొందరు విద్వాంసులు క్రోడీకరించారు. ఉదా : ఇమామ్ జహబీగారి 'కితాబుల్ కబాయిర్', అజ్జవాజిర్ మొదలగు గ్రంథాలు.

ఇకపోతే నీతిబాహ్యమైన చేష్టలు; ఉదాహరణకు : వ్యభిచారం, స్వలింగ సంపర్కం లాంటివి ఈ కోవలోకి వస్తాయి. ఏ సిగ్గుమాలిన పనులకు షరీయతు శిక్షల్ని విధిస్తుందో అవన్నీ 'నీతిబాహ్యత' క్రిందికి వస్తాయని మరి కొంతమంది భావిస్తున్నారు. నేడు లోకంలో నీతిబాహ్యత సర్వసామాన్యం అయిపోయింది. నీతిబాహ్యతే ప్రస్తుతం 'నాగరికత'గా వర్థిల్లుతోంది. చివరికి ముస్లింలు సయితం ఈ నీతిమాలిన నాగరికతను ఆశ్రయిస్తున్నారు. నేడు ఇంటింటా టీవీలు, వి.సి.ఆర్‌లు వచ్చేశాయి. స్త్రీలు పరదా

فِي بُطُونِ أُمَّهَاتِكُمْ فَلَا تُزَكُّوا أَنفُسَكُمْ هُوَ أَعْلَمُ بِمَنِ اتَّقَىٰ ﴿٣٢﴾

ఎంతో ఉదారంగా క్షమించేవాడు. ఆయన మిమ్మల్ని భూమి (మట్టి) నుండి సృజించి నప్పుడూ, మీరు మీ మాతృగర్భాలలో శిశు వులుగా ఉన్నప్పుడు[25] కూడా మీ గురించి ఆయనకు బాగా ఎరుకే. కాబట్టి మీ పారి శుద్ధ్యాన్ని గురించి మీరు (గొప్పలు) చెప్పు కోకండి.[26] దైవానికి భయపడే వాడెవడో ఆయనకు బాగా తెలుసు.

أَفَرَأَيْتَ الَّذِي تَوَلَّىٰ ﴿٣٣﴾

**33** సరేగాని (ఓ ప్రవక్తా! దైవ మార్గం నుండి) ముఖం త్రిప్పుకున్నవాణ్ణి నువ్వు గమనించావా?

وَأَعْطَىٰ قَلِيلًا وَأَكْدَىٰ ﴿٣٤﴾

**34** అతడు కాస్తంత ఇచ్చాడు. తర్వాత ఆపేశాడు.[27]

ఆజ్ఞలను ఖాతరు చెయ్యకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నారు. కో ఎడ్యుకేషన్, స్త్రీ పురుషుల మిశ్రమ సభలు సమావేశాలు, ఆఫీసుల్లో స్త్రీ పురుషుల విచ్చలవిడి కలయిక ఎన్నో అనర్థాలకు కారణభూతమవుతోంది. నిజానికి ఇవన్నీ 'నీతిబాహ్యత'కు వారధులే. చిన్న చిన్న పొరపాట్లను మినహాయించి పెద్ద పాపాలకు, నీతిబాహ్యతకు దూరంగా ఉండేవారికి దేవుని క్షమాభిక్ష లభిస్తుందని ఈ ఆయతులో చెప్పబడిందేగాని నీతిబాహ్యతకు మార్గం తెరిచే వారికి క్షమాభిక్ష లభిస్తుందని అనబడలేదు.

25. **'అజిన్నతున్'** అంటే గర్భస్థ శిశువులన్నమాట! 'జనీన్' దీని ఏకవచనం. జనీన్ అంటే కనిపించనిది. ఈ శిశువులు ప్రజల దృష్టికి రారు. కాని వారి పరిస్థితి గురించి దైవానికి ఎరుకే.

26. మీరు మీ మాతృగర్భాలలో ఉన్నప్పుడు ఏ పరిస్థితుల్ని ఎదుర్కొన్నారో, ఏ ఏ దశలను ఎలా అధిగమించారో ఎవరికీ తెలీకపోయినా దైవానికి మాత్రం తెలుసుకదా! మరలాంటప్పుడు మీరు మీ పవిత్రతను గురించి కోతలు కోయవలసిన అవసరం ఏముంది? అనవసరంగా మీరు మీ బడాయిని చాటుకోకండి. మీరు ప్రదర్శనా బుద్ధికి దూరంగా ఉండాలన్నదే దేవుని అభిలాష.

27. అంటే–కొద్దిగా దానం చేసి తన చేతిని కట్టిపడేసుకున్నాడు. లేదా కాస్తోకూస్తో విధేయత కనబరచి ఆ తరువాత వెనుకంజ వేశాడు. అరబీలో **'అక్దా'** అనబడింది. అక్దా అంటే అసలు అర్థం నేలను తవ్వుతూ తవ్వుతూ కఠినమైన రాయి వచ్చేసరికి తవ్వలేక మానెయ్యటం. ఎవరికయినా ఎంతో కొంత ఇచ్చి – పూర్తిగా ఇవ్వకుండా మధ్యనుంచే

**35** వాడి దగ్గర రహస్య జ్ఞానంగాని ఉందా? వాడు అన్నీ చూస్తూ ఉన్నాడా?[28]

أَعِندَهُۥ عِلْمُ ٱلْغَيْبِ فَهُوَ يَرَىٰٓ ﴿٣٥﴾

**36** ఏమిటీ, మూసా గ్రంథ ప్రతుల్లో గల విషయం గురించి వాడికి సమాచారం ఇవ్వబడలేదా?

أَمْ لَمْ يُنَبَّأْ بِمَا فِى صُحُفِ مُوسَىٰ ﴿٣٦﴾

**37** (అలాగే) విశ్వాసపాత్రుడైన ఇబ్రాహీము గ్రంథ ప్రతుల్లోని విషయం గురించి.

وَإِبْرَٰهِيمَ ٱلَّذِى وَفَّىٰٓ ﴿٣٧﴾

**38** (ఆ విషయం ఏమిటంటే) బరువును మోసేవాడెవడూ ఇంకొకరి బరువును మోయడు.

أَلَّا تَزِرُ وَازِرَةٌ وِزْرَ أُخْرَىٰ ﴿٣٨﴾

**39** ప్రతి మనిషీ దేనికోసం పాటుపడతాడో అది మాత్రమే అతనికి లభిస్తుంది.[29]

وَأَن لَّيْسَ لِلْإِنسَٰنِ إِلَّا مَا سَعَىٰ ﴿٣٩﴾

మానేసే వారి కొరకు ఈ పదం వాడబడింది. ఏదైనా మంచి పనిని ఉత్సాహంతో మొదలెట్టి దాన్ని పూర్తి చెయ్యకుండా వదిలేసే ఆరంభశూరులకు కూడా ఈ పదం వర్తిస్తుంది.

28. ఏమిటి, దైవమార్గంలో తాను నిరంతరం దానధర్మాలు చేస్తూపోతే తన సంపద తరిగి పోతుందని వాడనుకున్నాడా? దానికి సంబంధించిన రహస్య జ్ఞానంగాని అతని వద్ద ఉన్నదా? ముమ్మాటికీ లేదు. అసలు విషయం ఏమిటంటే అతని మనసు పేరాశకు నిలయమై పోయింది. పిసినారితనం అతన్ని ఆవహించింది. ప్రాపంచిక వ్యామోహం, పరలోకం పట్ల నమ్మక రాహిత్యం మూలంగా, దైవవిధేయతపట్ల వైముఖ్య ధోరణి కారణంగా వాడు ప్రస్తుతం నిందార్హుడుగా మారాడు.

29. ఏ విధంగా ఒక వ్యక్తి ఇతరుల పాపాలకు బాధ్యుడు కాడో, అదేవిధంగా ఇతరుల పుణ్యఫలాలు కూడా అతనికి ఇవ్వబడవు. అతను చేసుకున్న సత్కర్మల మేరకే పరలోకంలో అతనికి పుణ్యఫలం వొసగబడుతుంది (ఈ విషయం పరలోకానికి మాత్రమే వర్తిస్తుంది, ప్రపంచానికి కాదు. కొంతమంది సోషలిస్టు భావాలుగలవాళ్లు ఈ ఆయతును ప్రాపంచికమైన అర్థంలో తీసుకొని, నేరుగా శ్రమించనటువంటి జమీందారీ వ్యవస్థని, బాడుగల వసూళ్లను అధర్మంగా ఖరారు చేశారు. కాని వారి ఈ వాదన సరైనది కాదు). అయితే ఈ ఆయతు ఆధారంగా మృతునికి పుణ్యఫలం చేకూర్చే ఉద్దేశంతో నిర్వహించబడే ప్రత్యేక ఖుర్ఆన్ పారాయణా సదనాల పుణ్యం మృతునికి చేరదని విద్వాంసులు కొందరు చెబుతున్నారు. వారి ఈ వాదన

**40** నిశ్చయంగా అతని కృషి త్వరలోనే చూడబడుతుంది.[30]

وَأَنَّ سَعْيَهُ سَوْفَ يُرَىٰ ۝٤٠

**41** మరి అతనికి సంపూర్ణ ప్రతిఫలం వొసగబడుతుంది.

ثُمَّ يُجْزَاهُ الْجَزَاءَ الْأَوْفَىٰ ۝٤١

**42** కడకు అందరూ పోయి చేరవలసింది నీ ప్రభువు వద్దకే.

وَأَنَّ إِلَىٰ رَبِّكَ الْمُنْتَهَىٰ ۝٤٢

**43** మరి ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడిపిస్తున్నాడు.

وَأَنَّهُ هُوَ أَضْحَكَ وَأَبْكَىٰ ۝٤٣

**44** మరి ఆయనే చంపుతున్నాడు, ఆయనే బ్రతికిస్తున్నాడు.

وَأَنَّهُ هُوَ أَمَاتَ وَأَحْيَا ۝٤٤

**45** మరి ఆయనే జంటలను – అంటే ఆడ మగలను – సృజించాడు.

وَأَنَّهُ خَلَقَ الزَّوْجَيْنِ الذَّكَرَ وَالْأُنْثَىٰ ۝٤٥

---

సరైనదే. ఎందుకంటే ఇది మృతుని కృషిగానీ, అతని సత్కర్మగానీ కాదు. అందుకే మహనీయ ముహమ్మదు (సఅసం) వారు మృతుని పేరిట ఖుర్‌ఆన్ పఠనా సదస్సులను పెట్టమని తన అనుచరులకు సూచనప్రాయంగా కూడా చెప్పలేదు. 'మూలం' ద్వారా కూడా ఆ మేరకు ఎలాంటి ఆధారం లభించదు. అలాగే ప్రవక్త ప్రియసహచరుల (రజి) ద్వారా కూడా దీనికి సంబంధించిన ఉదాహరణలేమీ కనిపించవు. ఒకవేళ ఈ పని 'పుణ్యప్రదం' అయివుంటే ప్రవక్త ప్రియసహచరులు (రజి) దాన్ని తప్పకుండా చేసి ఉండేవారు.

అదలా వుంచితే ఆరాధనలకు, సామీప్యానికి సంబంధించిన ఏదైనా ఆచరణ చేయాలంటే దానికి ఏదైనా 'మూలం' అవశ్యం. ఈ విషయంలో కాకిలెక్కలు, ఊహాగానాలు పనికిరావు. కాకపోతే దుఆ (వేడుకోలు), దానధర్మాల పుణ్యం మాత్రం మృతులకు చేరుతుంది. ఈ విషయంలో విద్వాంసుల మధ్య కూడా ఏకాభిప్రాయం ఉంది. ఎందుకంటే దీన్ని సమర్థించే 'మూలం' ఉంది. మనిషి మరణించిన తరువాత కూడా అతనికి సంబంధించిన మూడు విషయాలు కొనసాగుతుంటాయన్న హదీసు దీనికి మూలాధారంగా ఉన్నది. నిజానికి అవి కూడా ఆ మృతునికి సంబంధించిన కర్మలే. అతడు చనిపోయిన తరువాత కూడా ఏదో ఒకవిధంగా అవి ఎడతెగకుండా సాగుతుంటాయి. మనిషి సంతానాన్ని మహాప్రవక్త (స) అతని సంపాదనగా ఖరారు చేశారు (సుననె నసాయి – కితాబుల్ బుయూ). ఇక 'సదఖయె జారియా' (ఎడతెగని దానం) కూడా – వక్ఫ్ మాదిరిగా – మనిషి వదలివెళ్ళిన సదాచరణే. "వారు ముందు

**46** (గర్భంలో) కార్చబడినప్పటి వీర్యపు బిందువుతో!

مِنْ نُّطْفَةٍ إِذَا تُمْنٰى ﴿٤٦﴾

**47** మలిసారి బ్రతికించి లేపే బాధ్యత కూడా ఆయనదే.

وَأَنَّ عَلَيْهِ النَّشْأَةَ الْأُخْرٰى ﴿٤٧﴾

**48** మరి ఆయనే ధనవంతులుగా చేస్తు న్నాడు. మూలధనాన్ని కూడా ప్రసాది స్తున్నాడు.[31]

وَأَنَّهُ هُوَ أَغْنٰى وَأَقْنٰى ﴿٤٨﴾

**49** షీరా (నక్షత్రము) కు ప్రభువు కూడా ఆయనే.[32]

وَأَنَّهُ هُوَ رَبُّ الشِّعْرٰى ﴿٤٩﴾

**50** ప్రాచీన ఆదు వారిని అంతమొందిం చింది కూడా ఆయనే.[33]

وَأَنَّهُ أَهْلَكَ عَادًا الْأُولٰى ﴿٥٠﴾

---

చేసి పంపినదీ, వెనుక విడిచి వెళ్ళినదీ మేము వ్రాస్తుంటాము" (యాసీన్ – 12). అలాగే మనిషి ప్రజల మధ్య వదలి వెళ్ళిన జ్ఞానాన్ని ప్రజలు గనక అనుసరించి ప్రయోజనం పొందుతూ ఉంటే అది కూడా అతని 'సంపాదన'గానే పరిగణించ బడుతుంది. "ఎవరయినా సన్మార్గం వైపుకు పిలుపుఇస్తే, అతని పిలుపు మేరకు భావితరాలు దాన్ని అనుసరిస్తే, అలా అనుసరించే వారి పుణ్యఫలం కూడా ఆ వ్యక్తికి చేరుతూ ఉంటుందన్న హదీసు (సుననె అబూదావూద్ – కితాబుస్సున్న) ఈ ఖుర్ఆన్ వచనానికి విరుద్ధం కాదు (ఇబ్నె కసీర్).

30. అంటే – అతను ప్రపంచంలో మంచి చేసినా – చెడు చేసినా, రహస్యంగా చేసినా – బహిరంగంగా చేసినా ప్రళయదినాన అది అతని ముందుకు తీసుకురాబడుతుంది. దానికి తగ్గ ప్రతిఫలం అతనికి ఇవ్వబడుతుంది.

31. అంటే – కొందరికి ఆయన కావలసినంత సంపదను ఇచ్చి ఇతరులపై ఆధారపడ కుండా చేస్తాడు. వారి జీవనావసరాలు తీరటంతోపాటు వారి దగ్గర ధనధాన్యాలు మిగిలిపోతాయి.

32. ఆ మాటకొస్తే సమస్తానికి యజమాని ఆయనే. కాకపోతే కొన్ని అరబ్బు తెగలు 'షీరా' అనే ఒక ప్రకాశమానమైన నక్షత్రాన్ని పూజిస్తూ ఉన్నందువల్ల – వారి మూఢనమ్మకాన్ని త్రుంచటానికి – ఆ నక్షత్రానికి ప్రభువు అల్లాహ్‌యే అని నొక్కి పలకటం జరిగింది.

33. ఆదు జాతి వారిని ప్రాచీనులు లేక ప్రథములు అని అనటంలోని ఔచిత్యమేమిటంటే

| | |
|---|---|
| **51** సమూదు వారిని కూడా – ఒక్కర్నీ మిగల్చకుండా (తుదముట్టించిన వాడూ ఆయనే)! | وَثَمُودَا فَمَآ أَبْقَىٰ ﴿٥١﴾ |
| **52** అంతకు మునుపు నూహు జాతివారిని (ఆయనే తుడిచిపెట్టాడు). నిశ్చయంగా వారు పరమ దుర్మార్గులు, తలబిరుసులు. | وَقَوْمَ نُوحٍ مِّن قَبْلُ ۖ إِنَّهُمْ كَانُوا۟ هُمْ أَظْلَمَ وَأَطْغَىٰ ﴿٥٢﴾ |
| **53** తలక్రిందులుగా చేయబడిన బస్తీలను ఆయనే అమాంతం ఎత్తి పడవేశాడు.[34] | وَٱلْمُؤْتَفِكَةَ أَهْوَىٰ ﴿٥٣﴾ |
| **54** మరి ఆ బస్తీలపై క్రమ్ముకున్నదేదో వచ్చి క్రమ్ముకుంది.[35] | فَغَشَّىٰهَا مَا غَشَّىٰ ﴿٥٤﴾ |
| **55** కనుక (ఓ మనిషీ!) నువ్వు నీ ప్రభువు అనుగ్రహాలలో దేనిపై గొడవపడగలవు?[36] | فَبِأَىِّ ءَالَآءِ رَبِّكَ تَتَمَارَىٰ ﴿٥٥﴾ |
| **56** ఈయన పూర్వం హెచ్చరించిన ప్రవక్తల మాదిరిగానే హెచ్చరించే ప్రవక్త. | هَـٰذَا نَذِيرٌ مِّنَ ٱلنُّذُرِ ٱلْأُولَىٰٓ ﴿٥٦﴾ |
| **57** రానున్న గడియ దగ్గరపడింది. | أَزِفَتِ ٱلْـَٔازِفَةُ ﴿٥٧﴾ |

వారు సమూదు జాతికి పూర్వం గతించారు. నూహ్ జాతివారి తరువాత దైవాగ్రహానికి గురైన అతి పెద్ద జాతి ఇదే.

మరికొంతమంది అభిప్రాయం ప్రకారం 'ఆదు' పేరుతో రెండు జాతులు గడిచాయి. ఈ ఆయతులో ప్రస్తావనకు వచ్చిన వారు మొదటివారు. వీళ్లు ఉధృతమైన పెనుగాలుల ద్వారా అంతమొందించబడ్డారు. రెండవ ఆదు జాతివారు కాల చక్రపు ఎగుళ్లు దిగుళ్లతో వివిధ పేర్లతో – చెల్లాచెదురై – మనుగడ సాగించారు.

34. తలక్రిందులుగా చేయబడిన బస్తీలు (పురములు) అంటే హజ్రత్ లూత్ (అలైహిస్సలాం) జనులన్నమాట. వారి పాపిష్టి పని మూలంగా వారి బస్తీలను వారి మీదే ఎత్తి పడవెయ్యటం జరిగింది.

35. అంటే – తర్వాత వారిపై రాళ్ల వాన కురిసింది.

36. ఈ కల్లోల జనకులను, తిరుగుబాటుదార్లను అంతమొందించటం కూడా ఒక విధంగా దైవానుగ్రహమే. ఈ అనుగ్రహాలను మనిషి ఎలా కాదనగలడు? వాటిని ఎలా అనుమానిస్తాడు?? వాటిపై ఎలా దెబ్బలాడతాడు???

لَيْسَ لَهَا مِنْ دُوْنِ اللّٰهِ كَاشِفَةٌ ۝٥٨

**58** అల్లాహ్ తప్ప దాన్ని (ఆ నిర్ణీత సమయాన) స్పష్టంగా చూపించేవాడెవడూ లేడు.

اَفَمِنْ هٰذَا الْحَدِيْثِ تَعْجَبُوْنَ ۝٥٩

**59** ఏమిటీ, మీరు ఈ విషయంపై ఆశ్చర్య పోతున్నారా?[37]

وَتَضْحَكُوْنَ وَلَا تَبْكُوْنَ ۝٦٠

**60** నవ్వి పోతున్నారా? ఏడుపు రావటం లేదా?

وَاَنْتُمْ سٰمِدُوْنَ ۝٦١

**61** పైపెచ్చు ఆటపాటల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారు.

فَاسْجُدُوْا لِلّٰهِ وَاعْبُدُوْا ۩ ۝٦٢

السجدة ١٣

**62** అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడండి. (ఆయన్నే) ఆరాధించండి.[38]

37. ఇక్కడ **'విషయం'** (హదీస్) అంటే దివ్య ఖుర్ఆన్ అని అర్థం. అంటే మీరు ఈ ఖుర్ఆన్‌పై ఆశ్చర్యం చెందుతున్నారా? ఇందలి విషయాన్ని ఎగతాళి చేస్తున్నారా? వాస్తవానికి ఇందులో ఆశ్చర్యపోయే విషయంగానీ, వేళాకోళపు మాటగాని ఏదీ లేదు.

38. ముష్రిక్కులకు, దైవధిక్కారులకు హెచ్చరికగా వచ్చిన ఆదేశమిది. వారు దివ్య ఖుర్ఆన్ ఆజ్ఞలముందు తల ఒగ్గాల్సిందిపోయి, దాన్ని పరిహసించే విధంగా ప్రవర్తిస్తున్నారు. మా ప్రవక్త చేసే హితబోధనలను వారు లెక్కచేయటం లేదు. కాబట్టి ఓ ముస్లింలారా! మీరు మాత్రం అల్లాహ్ సన్నిధిలో మోకరిల్లండి. ఆయన్ని సేవించి, ఆయన ఆజ్ఞలను శిరసావహించి ఖుర్ఆన్ పట్ల గల గౌరవప్రపత్తులను చాటిచెప్పండి. ఈ ఆజ్ఞ రాగానే దైవప్రవక్త (స) మరియు ఆయన ప్రియసహచరులు దైవసన్నిధిలో 'సజ్దా' చేశారు. ఆ సమయంలో ఆ సమావేశంలో ఉన్న అవిశ్వాసులు సయితం సాష్టాంగపడిపోయారని హదీసుల ద్వారా తెలుస్తోంది.